

మళ్లీ వరద



పాత ఎడ్లంక వద్ద వరద నీటిలో కొట్టుకుపోయిన కాజ్‌వే



పులిగడ్డ ఆక్విడెక్ట్‌ను తాకుతూ ప్రవహిస్తున్న వరద

- దివిసీమ గ్రామాలకు తీవ్రనష్టం
- కొట్టుకుపోయిన ఎడ్లంక కాజ్‌వే
- గ్రామానికి రాకపోకలు బంద్
- నాటు పడవలో ప్రమాదకరంగా ప్రయాణం

అవనిగడ్డ, ఆగస్టు 30 : ప్రకాశం బ్యారేజీ నుంచి భారీగా వరద వస్తుండటంతో అవనిగడ్డలోని దివి గ్రామాల్లో ఒక్కటైన పాత ఎడ్లంకకు వెళ్లే కాజ్‌వే కొట్టుకుపోయింది. దీంతో ఈ గ్రామానికి బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. పులిగడ్డ వద్ద శుక్రవారం ఉదయానికి 11 అడుగుల నీటిమట్టం నమోదు కాగా, సాయంత్రానికి మరో అడుగు మేర నీటి మట్టం పెరిగింది. వరద ప్రవాహం అధికంగా ఉండటంతో లంక గ్రామాల్లో వ్యవసాయం చేసుకునేవారు, పశువుల కాపరులు నదిలోకి వెళ్లొద్దని అధికారులు సూచించారు.

విద్యార్థులకు ఇక్కట్లు

అవనిగడ్డ నుంచి ఎడ్లంక వెళ్లే తాత్కాలిక కాజ్‌వే వరద ప్రవాహ ఉధృతికి కొట్టుకుపోవటంతో ఎడ్లంకవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొద్దిరోజుల క్రితం వచ్చిన వరదల కారణంగా తాత్కాలిక కాజ్‌వే కొట్టుకు పోగా, వరదలు తగ్గిన వెంటనే అధికారులు యుద్ధప్రాతి పదికన మరో కాజ్‌వేను నిర్మించారు. ఇంతకాలం ఈ కాజ్‌వేపై ప్రజలు రాకపోకలు సాగిస్తుండగా, తాత్కాలిక కాజ్‌వేకు అటు, ఇటు సరైన పటిష్టత లేకపోవటంతో వరద మొదలైన కొద్దిసేపటికే కొట్టుకుపోయింది. దీంతో ఎడ్లంకవాసులు రాకపోకలు సాగించేందుకు వీలుగా రెవెన్యూ అధికారులు పడవను ఏర్పాటు చేశారు. పాఠశాల, కళాశాలకు వెళ్లే విద్యార్థులు ప్రమాద భరితంగా నాటుపడవలపై రాకపోకలు సాగిస్తున్నారు.

మరో రెండు రోజులు

పులిచింతల నుంచి దిగువకు విడుదల చేసే నీటి పరిమాణం 3 లక్షల క్యూసెక్కులకుపైగా కొనసాగుతుండటంతో మరో రెండు రోజులపాటు ప్రకాశం బ్యారేజీ నుంచి వరద కొనసాగుతుందని నీటి పారుదల శాఖ అధికారులు చెబుతున్నారు. గురువారం 3.17 లక్షల క్యూసెక్కుల నీరు విడుదల చేయగా, శుక్రవారం 3.40 లక్షల క్యూసెక్కులు వదిలారు. ఎగువ ప్రాజెక్టుల నుంచి వరద ప్రవాహం కొనసాగుతుండగా, ఈ ప్రాంతంలో వర్షాలు కురవటంతో సోమవారం వరకు ఇదే పరిస్థితి ఉంటుందని అధికారులు తెలిపారు. పాత ఎడ్లంక వద్ద పోలీసు పికెట్, వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేయగా, నాగాయలంక శ్రీరామపాదక్షేత్రం వద్ద కృష్ణవేణి అమ్మవారి విగ్రహ ప్లాట్‌ఫాం తాకుతూ వరద నీరు ప్రవహిస్తోంది. పోటు సమయంలో మరో అడుగున్నర మేర వరద పెరుగుతోందని మత్స్యకారులు అంచనా వేస్తున్నారు.



కష్టాలు కనపడవా?

లంక గ్రామాలకు ప్రమాదకరంగా పడవ ప్రయాణం

- ఏటా వర్షాకాలం 4 నెలలూ ఇదే పరిస్థితి
- పాఠశాలకు వెళ్లడానికి విద్యార్థులకు నిత్య నరకమే
- కనీసం లైఫ్ జాకెట్లు కూడా లేకుండా రాకపోకలు
- ప్రస్తుతం 3.30 లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహం
- అయినా యథేచ్ఛగా పడవ ప్రయాణాలు

తోట్లవల్లూరు, ఆగస్టు 30 : కృష్ణమ్మ బిరబిరా పరుగులిడితే.. బంగారు పంటలే పండుతాయని సంబరపడిపోతాం.. పాడి పంటలకు కొదవ ఉండదని ఊపిరిపీల్చు కుంటాం.. కానీ, కృష్ణమ్మ వరద వెనుక ఆహ్లాద క్షణాలే కాదు.. ఆనంద బాష్పాలు కూడా ఎన్నో దాగి ఉన్నాయని లంక గ్రామస్థుల చెమర్చిన కళ్లు చూస్తే తెలుస్తుంది. కన్నీరు వరదలై పారుతున్నా కృష్ణమ్మ ఒడే తమకు గర్భగుడి అని నిత్యం ప్రాణాలు అరచేతపట్టుకుని జీవిస్తున్న వారిని చూస్తే ఆశ్చర్యమేస్తుంది. ఈ చిత్రాలు కూడా అలాంటివే. తోట్లవల్లూరు మండలం కృష్ణానది పాయల్లోని తోట్లవల్లూరు, పాములలంక, వల్లూరుపాలెం, భద్రిరాజుపాలెం, చాగంటిపాడు, దేవరపల్లి, ఐలూరు గ్రామాల్లో 3వేల మందికిపైగా జనాభా ఉన్నారు. వరద వస్తే.. ఈ గ్రామాల ప్రజలకు నిత్య నరకమే. ఏ చిన్న అవసరమైనా నదీపాయను పడవలపై దాటి వస్తుంటారు. విద్యార్థులైతే వానైనా, వరదైనా పడవల ప్రయాణం చేయక తప్పదు. సాధారణ రోజుల్లో ఇసుక తిన్నెల్లో కిలోమీటర్లు నడిచే విద్యార్థులు వర్షాకాలం 4 నెలలు మాత్రం ఇదిగో ఇలా ప్రమాదకరంగానే రాకపోకలు సాగిస్తారు. ఇక్కడ మొత్తం 15 రేవులు ఉండగా, విద్యార్థులు, లంక గ్రామాల ప్రజలే కాకుండా రైతులు, వ్యవసాయ కూలీలు ఈ పడవలపై ప్రయాణిస్తున్నారు.

ప్రాణాలు.. గాల్లో దీపాలు

ఈ పడవల్లో ప్రయాణం గాల్లో దీపంలా మారింది. ఎక్కడా నిబంధనలు పాటిస్తున్న దాఖలాలు లేవు. లైఫ్ జాకెట్ ధరించకుండా పడవల్లో ప్రయాణించటం నిబంధనలకు విరుద్ధం. ఒక్క పాముల లంక నుంచి వంద మంది విద్యార్థులు రోజూ పడవలపై రాకపోకలు సాగిస్తుండగా, కనీసం వీరికి కూడా లైఫ్ జాకెట్లు ఇవ్వలేదు. పడవల ఫిట్‌నెస్, వాటిని నడిపే వారి అర్హతలను కూడా అధికారులు పరిశీలించిన దాఖలాలు లేవు.

తగు సూచనలు చేశాం : తహసీల్దార్

అన్ని రేవులను శుక్రవారం సందర్శించాను. పడవల యజమానులకు తగిన సూచనలు చేశాను. ఒక పడవలో 15 మందిని మించి ఎక్కించవద్దని చెప్పాం. లైఫ్ జాకెట్లు సరఫరా చేయాలని అధికారులకు లేఖ రాశాను.

- ఎం.కుసుమకుమారి, తహసీల్దార్

కెమెరాల వెనుక కథ ఏంటి?

గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాల బాలికల హాస్టల్ వాష్‌రూమ్‌ల్లో హిడెన్ కెమెరాలు ఏర్పాటు వెనుక అసలు ఉద్దేశమేంటి? ప్రేమికుల మధ్య ఉన్న అంతరంగిన వ్యవహారాలే దీనంతటికీ కారణమా? ఈ వ్యవహారాన్నే ఆధారంగా చేసుకుని ఒక గ్రూపునకు చెందిన విద్యార్థులు సదరు ప్రేమికులను బ్లాక్‌మెయిల్ చేశారా? లేక మరేమైనా ప్రేమకోణం దాగి ఉందా? ఇంతా జరుగుతున్నా కళాశాల యాజమాన్యం ఎందుకు మిన్నకుండిపోయింది? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

గుడ్లవల్లేరు కాలేజీలోని బాలిక వసతి గృహాల్లో కెమెరాలు పెట్టిందెవరు?

- ఆ ప్రేమికులను ఎవరైనా బ్లాక్‌మెయిల్ చేశారా?
- మరో ప్రేమ వ్యవహారం ఏమైనా నడిచిందా?
- యాజమాన్యం ఎందుకు మిన్నకుండిపోయింది?
- ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదెందుకు?
- విద్యార్థినుల ఆందోళనతో కాలేజీలో ఉద్రిక్తత
- ఆందోళన చేసిన వందలమంది విద్యార్థినులు
- మంత్రి, ఎమ్మెల్యేలు, కలెక్టర్, ఎస్పీ హామీతో విరమణ
- విచారణకు ఆదేశించిన ముఖ్యమంత్రి చంద్రబాబు

గుడ్లవల్లేరు, ఆగస్టు 30 : గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాలలో బాలికల హాస్టల్ వాష్‌రూమ్‌ల్లో హిడెన్ కెమెరాల ఏర్పాటు వివాదం వందలమంది విద్యార్థినులు, వారి తల్లిదండ్రులను మానసిక క్షోభకు గురిచేసింది. ఇంత జరుగుతున్నా కళాశాల యాజమాన్యం ఎందుకు మిన్నకుండిపోయిందనే విమర్శలు వస్తున్నాయి. ఒక విద్యార్థినికి ఉన్న రాజకీయ నేపథ్యం కారణంగానే యాజమాన్యానికి బెదిరింపులు ఎదురయ్యాయా అనే కోణం వెలుగుచూసింది. ఈ అంశంపై నేరుగా ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించి విచారణకు ఆదేశించడంతో మరింత సంచలనంగా మారింది.



గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాల బాలికల హాస్టల్ ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థినులు

ప్రేమ వ్యవహారాలే కారణమా..?

కళాశాలలో కొందరు విద్యార్థుల మధ్య జరిగిన ప్రేమ వ్యవహారాలే ఈ హిడెన్ కెమెరాల ఏర్పాటుకు కారణమని తెలుస్తోంది. ప్రధాన ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రేమికులిద్దరూ ప్రకాశం జిల్లాకు చెందినవారు. వీరి మధ్య పరిచయం స్నేహంగా, ఆ తర్వాత ప్రేమగా మారింది. ఈ విషయం బయటకు రాకుండా కొందరు కావాలనే ఇలా చేయించారని చెబుతుండగా, తెరవెనుక మరో కథ కూడా నడిచిందని తెలుస్తోంది. సదరు ప్రేమికుడికి అదే కళాశాలకు చెందిన ఓ స్నేహితుడు ఉన్నాడు. ఇద్దరూ సరదాగా ఉండేవారు. ఒకరిళ్లకు ఒకరు వెళ్లేవారు. కొంతకాలానికి స్నేహితుడి చెల్లెలిని ప్రేమికుడు ప్రేమలోకి దించాడు. ఈ వ్యవహారం స్నేహితుడికి తెలిసి ఇద్దరి మధ్య మనస్పర్థలొచ్చాయి. మాటామాటా పెరిగి 'నీ ప్రియురాలికి నువ్వు చేసిన వీడియో కాల్స్ స్క్రీన్ షాట్స్ నా దగ్గర ఉన్నాయి. వాటిని బయటపెడతాను' అని స్నేహితుడు బెదిరించాడు. ఇందుకు నిందితుడు కూడా.. 'నీ చెల్లితో నేను చేసిన చాటింగ్ స్క్రీన్‌షాట్లు బయటపెడతాను.' అన్నాడు. దీంతో ఇద్దరి మధ్య వివాదం ముదిరింది.

- మిగతా 6లో

రాత్రిపూట మళ్లీ కలకలం

మచిలీపట్నం, ఆంధ్రజ్యోతి : గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాల వసతి గృహం వద్ద శుక్రవారం రాత్రి మళ్లీ అలజడి నెలకొంది. హిడెన్ కెమెరాల ఏర్పాటుకు సహకరించినట్టుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న విద్యార్థిని బంధువులు శుక్రవారం రాత్రి వసతి గృహానికి వచ్చారు. ఆమెకు భోజనం పెట్టించేందుకు బయటకు తీసుకెళ్లారు. ఆ సమయంలో మళ్లీ ఏదో జరగబోతోందని విద్యార్థినులంతా గుమిగూడారు. 'ఉయ్ వాంట్ జస్టిస్' అంటూ నినాదాలు చేశారు. దీంతో పోలీసులు విద్యార్థినులకు సర్దిచెప్పారు. అరగంట తరువాత ఆ విద్యార్థినిని హాస్టల్‌కు తీసుకొచ్చారు.

• వన మహోత్సవం



వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మచిలీపట్నంలోని హైనీ హైస్కూల్ ఆవరణలో మంత్రి కొల్లు రవీంద్ర మొక్కలు నాటారు. ఆంధ్రప్రదేశ్‌ను హరితాంధ్రగా మారుస్తామని అధికారులు, ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు.

6లో..

జిల్లా ప్రత్యేకాధికారిగా విజయరామరాజు

మచిలీపట్నం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఇతరత్రా కార్యక్రమాల అమలును పర్యవేక్షించేందుకు కృష్ణాజిల్లా ప్రత్యేక అధికారిగా పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఎస్.విజయరామరాజును నియమిస్తూ జీవోఆర్‌టీ నెంబరు 1435ను ప్రభుత్వం శుక్రవారం జారీచేసింది. 2012 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన ఆయన జిల్లాలో ప్రభుత్వం ద్వారా అమలుచేసే అన్ని సంక్షేమ, ఇతరత్రా కార్యక్రమాలను పర్యవేక్షిస్తూ వివిధ విభాగాల అధికారులకు పలు సూచనలు చేస్తూ పర్యవేక్షించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

గుడివాడ మునిసిపల్ అసిస్టెంట్ కమిషనర్‌గా శ్రీనివాసరావు

గుడివాడ మునిసిపల్ కార్యాలయ అసిస్టెంట్ కమిషనర్‌గా కడప మునిసిపల్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న పి.శ్రీనివాసరావును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ప్రస్తుతం గుడివాడ మునిసిపల్ కార్యాలయంలో అసిస్టెంట్ కమిషనర్‌గా పనిచేస్తున్న డీటీవీ కృష్ణారావును నూజివీడు మునిసిపల్ కమిషనర్‌గా బదిలీ చేశారు.



అలవెన్సులను పునరుద్ధరించాలని డిపోలలో గేట్ మీటింగ్

ఉద్యోగుల అలవెన్సులు పునరుద్ధరించాలి

బస్‌స్టేషన్, ఆగస్టు 30 : ప్రజా రవాణ సంస్థ ఉద్యోగులకు నిలిపివేసిన అన్ని రకాల అలవెన్సులను పునరుద్ధరించాలని కోరుతూ శుక్రవారం ఎన్టీఆర్ జిల్లాలోని అన్ని డిపోలలో నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు అన్ని డిపోల వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యంగా జీ.ఓ.నెం.114 మేరకు అలవెన్సులు అన్ని జీతంతో కలిపి చెల్లించాలని కోరారు. ట్రెజరీ అధికారుల వైఖరికి నిరసన తెలిపారు. నల్ల బ్యాడ్జీలు పెట్టుకుని విధులకు హాజరయ్యారు. అన్ని డిపోల వద్ద గేట్ మీటింగ్‌లు నిర్వహించారు. అలవెన్సుల అంశాలపై త్వరలోనే ప్రభుత్వ పెద్దలను, ఉన్నతాధికారులను కలిసి విజ్ఞాపన పత్రాలు అందచేస్తామన్నారు. దీనిపై సెంట్రల్ కమిటీ సమావేశం ఏర్పాటు చేసి, తదుపరి కార్యాచరణ నిర్ణయిస్తామని తెలిపారు.

కృష్ణా జలాలు ఇవ్వకపోతే చలో అమరావతి

▸ దోనేపూడి శంకర్

ధర్నాచౌక్, ఆగస్టు 30 : నెలరోజుల్లో కృష్ణాజలాలను సరఫరా చేయాలని, లేకుంటే బాధితులతో కలిసి చలో అమరావతి చేపడతామని సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కిడ్నీ బాధితులకు న్యాయం చేయాలని కోరుతూ, సీఎం చంద్రబాబును కలిసి వారి వ్యధలను తెలియజేస్తామన్నారు. స్థానిక దాసరిభవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. కిడ్నీ బాధితుల వ్యధలు పాలకులకు పట్టడం లేదని మండిపడ్డారు. కూతవేటు దూరంలోనే కృష్ణాజలాలు ఉన్నా సరఫరా చేసే నాధుడే కరువయ్యారన్నారు. డయాలసిస్‌తో సంబంధం లేకుండా కిడ్నీ బాధితులకు నెలకు రూ. 10 వేల పింఛన్ ఇవ్వాలని, మృతి చెందిన వారి కుటుంబాలకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్రబాబు, సీపీఐ జిల్లా సహాయకార్యదర్శి బుడ్డి రమేష్, ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు చుండూరు వెంకట సుబ్బారావు, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు లంకా గోవిందరాజులు,, డీహెచ్‌పీఎస్ నేత బుట్టి రాయప్ప తదితరులు పాల్గొన్నారు.



రామచంద్రాపురం సచివాలయంలో పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

గ్రామాల్లో కిడ్నీ వ్యాధి నిర్ధారణ పరీక్షలు

ఎ.కొండూరు : గ్రామాల్లో కిడ్నీ వ్యాధి నిర్ధారణ పరీక్షలు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్నట్టు పీహెచ్‌సీ వైద్యులు, వి.స్వాతి, దివ్య తెలిపారు. శుక్రవారం మండలంలోని రామచంద్రాపురం శివారు కోమటికుంట్ల గ్రామంలో 32 మందికి కిడ్నీ వ్యాధి నిర్ధారణ కోసం రక్త నమూనాలు సేకరించినట్టు తెలిపారు. ఇప్పటికే గిరిజన తండాలో సర్వే జరిగిందని, మిగిలిన గ్రామాల్లో సెప్టెంబర్ 5 వరకు పరీక్షలు నిర్వహిస్తామన్నారు. గ్రామాల్లో ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ బాల మురళీకృష్ణ, ఆరోగ్య సిబ్బంది దీప, అరుణ, సువర్ణరాజు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సినీరంగంలో మకుటంలేని మహారాజు బాలయ్య

▸ ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

పామర్రు: కళామతల్లి ముద్దుబిడ్డగా సినీరంగంతోపాటు ప్రజాప్రతినిధిగా ఎంతోమంది కేన్సర్ బాధితులకు రక్షణగా నిలుస్తు మకుటంలేని మహారాజుగా అ ఘనత నందమూరి బాలయ్యబాబుకే దక్కుతుందని పామర్రు ఎమ్మెల్యే వర్లకుమార్‌రాజా అన్నారు. బాలయ్య నటుడిగా 50 వసంతాలు పూర్తిచేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని శుక్రవారం నిమ్మకూరులో ఎన్‌బీకే హెల్పింగ్ హ్యాండ్స్ అనంతపురం జగన్ అధ్వర్యంలో విజయోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈసందర్భంగా కుమార్‌రాజా మాట్లాడుతూ, సినీ, రాజకీయ రంగాల్లో బాలకృష్ణ ప్రయాణం అన్‌స్టాపబుల్ అన్నారు. తొలుత టీడీపీ వ్యవస్థాపకుడు దివంగత ముఖ్యమంత్రి ఎన్టీఆర్ బవసతారకం దంపతుల విగ్రహాలకు కూమార్‌రాజా పూలమాలవేసి నివాళులర్పించి, కేక్ కట్‌చేసి పంచిపెట్టారు.

కెమెరాల వెనుక కథ ఏంటి?

(5వ పేజీ తరువాయి)

కాగా, నిందితురాలిని మరో స్నేహితుడు వన్‌సైడ్ లవ్ చేస్తుండగా, అతని ద్వారా ఈ హిడెన్ కెమెరాల అంశాన్ని తెరపైకి తెచ్చారని తెలుస్తోంది. సదరు నిందితురాలు ఈ వీడియోలను బయటకు పంపుతోందనే ఆరోపణలతో విద్యార్థినులు శుక్రవారం తెల్లవారుజాము నుంచి కళాశాల ఆవరణలో ఆందోళనకు దిగారు. దీంతో పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇద్దరి సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఏబీవీపీ, మహిళా మోర్చా నాయకులు కూడా కళాశాలకు చేరుకోవడంతో ఆందోళన మరింత ఉధృతమైంది.

సంఘటనాస్థలానికి కలెక్టర్, ఎస్పీ

ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో కలెక్టర్ బాలాజీ, ఎస్పీ గంగాధరరావు శుక్రవారం గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాలకు వెళ్లారు. వివరాలు సేకరించారు. కాగా, వాష్‌రూమ్‌ల్లో హిడెన్ కెమెరాలు ఏర్పాటు చేశారనే విషయాన్ని వారం క్రితమే కళాశాల యాజమాన్యానికి ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని, విచారణ చేయాలంటే నెల సమయం పడుతుందన్నారని విద్యార్థినులు మండిపడ్డారు. పైగా ఫిర్యాదు చేసిన తమపైనే కేసు పెడతామని బెదిరించారని అధికారులు, మీడియాకు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఘటనపై విచారణ చేసి విద్యార్థినులకు న్యాయం చేస్తామని, వాష్‌రూమ్‌ల్లో హిడెన్ కెమెరాల ఆచూకీ కనుగొనేందుకు ఎస్‌ఎస్‌జేడీ పరికరంతో పరిశీలించడానికి ప్రత్యేక బృందాన్ని నియమించామన్నారు. నిందితుడిని తమ ముందుకు తీసుకురావాలని విద్యార్థినులు డిమాండ్ చేయగా, అనుమానితులను ఇక్కడకు తీసుకొస్తే శాంతిభద్రతల సమస్య తలెత్తుతుందని, పూర్తిస్థాయి విచారణచేసి నిందితులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఎంతటి వారినైనా వదిలిపెట్టం : మంత్రి కొల్లు రవీంద్ర

ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్నారని, ఈ సంఘటనకు పాల్పడినవారు ఎంతటి వారినైనా వదిలిపెట్టేది లేదని విద్యార్థినులకు మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యేలు వర్ల కుమార్‌రాజా, కాగిత కృష్ణప్రసాద్, యార్లగడ్డ వెంకట్రావు, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా మాట్లాడుతూ తన మేనకోడలు కూడా అక్కడే చదువుతోందని, తాను కూడా బాధిత కుటుంబానికి చెందినవాడినేనన్నారు. కాగా, ఆందోళన చేస్తున్న తమపై పరీక్షలు, మార్కుల పేరిట యాజమాన్యం వేధించే అవకాశం ఉందని విద్యార్థినులు ఆందోళన చెందగా, అలాంటిదేమీ ఉండదంటూ యాజమాన్యం ద్వారా అధికారులు లిఖితపూర్వకంగా హామీ ఇప్పించారు. ఘటనకు బాధ్యత వహిస్తూ వార్డెన్‌ను సస్పెండ్ చేస్తామని కళాశాల ప్రతినిధులు ప్రకటించారు.

ఆందోళన విరమణ

వీడియోలు బయటకు రానివ్వబోమని మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యేలు, అధికారులు హామీ ఇవ్వడంతో విద్యార్థినులు ఆందోళన విరమించారు. మంగళవారంలోగా విచారణను పూర్తిచేస్తామని పోలీసులు హామీ ఇచ్చారు. వసతి గృహంలో విద్యార్థినులకు రక్షణగా మహిళా పోలీసులతో ప్రత్యేక టీమ్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. ఆందోళన విరమించిన విద్యార్థినులు.. విచారణ పూర్తయ్యే వరకు తరగతులకు హాజరుకాబోమని చెప్పారు.

విచారణలో వాస్తవాలు తెలుస్తాయి : కళాశాల యాజమాన్యం

హాస్టల్‌లోని వాష్‌రూమ్‌ల్లో హిడెన్ కెమెరాలు ఉన్నాయని కళాశాల యాజమాన్యం నమ్మడం లేదు. పోలీసుల విచారణలో వాస్తవాలు వెల్లడవుతాయి. తప్పుచేసిన వారికి చట్ట ప్రకారం శిక్ష పడుతుంది. విచారణ అనంతరం ఎలాంటి చర్యలు తీసుకోవాలనేది నిర్ణయిస్తాం. వాష్‌రూమ్‌ల్లో హిడెన్ కెమెరాలు ఉన్నాయనే విషయం విద్యార్థినుల ఆందోళనతోనే మా దృష్టికి వచ్చింది.

- వల్లూరుపల్లి సత్యనారాయణరావు, కళాశాల సెక్రటరీ

కళాశాల వద్ద వైసీపీ నేతల హడావిడి

గుడ్లవల్లేరు : గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాలలోకి వెళ్లేందుకు శుక్రవారం రాత్రి వైసీపీ నేతలు విఫలయత్నం చేశారు. విద్యార్థినులతో మాట్లాడాలని జెడ్పీటీసీ ఉప్పాల హారిక, పేర్నికిట్టు, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణిలు కళాశాలకు వచ్చారు. అయితే విచారణ జరుగుతుందంటూ వారిని పోలీసులు లోనికి వెళ్లేందుకు నిరాకరించారు. ప్రజా ప్రతినిధులు వస్తే ఎందుకు వెళ్లనివ్వరు అంటూ హ్యూమన్ కమిషన్ ఛైర్మన్ పోలీసులను ప్రశ్నించడమే కాక ఎస్పీని పిలవండి మాట్లాడతా అంటూ హడావిడి చేశారు. అయితే పోలీసులు ససేమిరా అనడంతో వైసీపీ నేతలు వెనుదిరిగారు.

హరితాంధ్ర వైపు అడుగులు

▸ వనమహోత్సవంలో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన పిలుపు

వన్‌టౌన్, ఆగస్టు 30 : రాష్ట్రాన్ని హరితాంధ్రగా చేయటం కోసం ప్రతిఒక్కరూ సమిష్టిగా అడుగులు వేయాలని, భవితకు పచ్చని బాట వేయాలని, ప్రతిఒక్కరూ ఒకమొక్క నాటి సంరక్షణ బాధ్యతను కూడా తీసుకోవాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.సృజన అన్నారు. అటవీశాఖ ఆధ్వర్యంలో లబ్బీపేటలోని బిషప్ అజరయ్య బాలికల ఉన్నతపాఠశాల ఆవరణలో ఈ ఏడాది వనమహోత్సవ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావుతో కలిసి మొక్కలు నాటిన కలెక్టర్ అనంతరం జరిగిన సభలో మాట్లాడుతూ, పర్యావరణ సమతుల్యం లోపించటం కారణంగా పలు విపత్కర పరిస్థితులు సంభవిస్తున్నాయన్నారు. దీనికి పరిష్కారంగా పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం మార్గమని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భారీస్థాయిలో మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టాయన్నారు. జిల్లాలో 30 వేలకు పైగా మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, అటవీ విస్తీర్ణాన్ని 33 శాతానికి పెంచనున్నట్టు తెలిపారు. తల్లిపై ఉన్న ప్రేమకు గుర్తుగా 'ఏక్ పెడ్ మాకే నామ్' నినాదంతో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. 2025 మార్చినాటికి దేశవ్యాప్తంగా 140 కోట్ల మొక్కలను నాటాలనే లక్ష్యంతో ప్రధాన మంత్రి సూచనల మేరకు ప్లాంట్ ఫర్ మదర్ (తల్లికోసం ఒక మొక్క) కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ, పచ్చని చెట్లు ప్రగతికి సోపానమని, వాతావరణ సమతుల్యానికి మొక్కలను విరివిగా పెంచాలని చెప్పారు. జిల్లా అటవీ శాఖ అధికారి కె.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వ సూచనల మేరకు కార్తీకమాసం వరకు మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. జిల్లాలో 27,446 చదరపు కిలో మీటర్ల అటవీ విస్తీర్ణం ఉందని, ప్రస్తుతం 20 శాతం మాత్రమే ఉన్న పచ్చదనాన్ని 30 శాతానికి తీసుకువెళ్లేందుకు లక్ష్యంగా పెట్టుకుని మొక్కలు నాటిస్తున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో అతిధులు ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ శుభం నోఖ్వాల్, వీఎంసీ అదనపు కమిషనర్ ఎ.మహేష్, అటవీ శాఖ అధికారులు ఎం.సోమరాజు, ఎన్.భానుప్రకాష్, జి.దుర్గారావు, జి.సాయి శివకుమార్, ఎస్.నరసింహారావు, బిషప్ అజరయ్య కళాశాల కరస్పాండెంట్ టి.రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.



బిషప్ అజరయ్య పాఠశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న విద్యార్థినులు



అధికారులు, నేతలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

▸ మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 30 : పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని మంత్రి కొల్లు రవీంద్ర పిలుపునిచ్చారు. వనమహోత్సవంలో భాగంగా శుక్రవారం స్థానిక హైనీ హైస్కూలు ఆవరణలో అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి మొక్కలు నాటారు. అనంతరం అధికారులు, ప్రజలతో మంత్రి ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా రవీంద్ర మాట్లాడుతూ, ప్రాణవాయువు అందించే మొక్కలను పెంచవలసిన బాధ్యత అందరిపై ఉందన్నారు. రాష్ట్రంలో 26 శాతం ఉన్న పచ్చదనాన్ని 50 శాతానికి పెంచాలన్నారు. కృష్ణాజిల్లాలో 9.8 శాతం అడవుల విస్తీర్ణం ఉందని, దీనిని మరింత విస్తరించాలన్నారు. సముద్ర తీరం వెంట ఉన్న మడ అడవులు పరిరక్షించాలన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో ఎం.వాణి, నగరపాలక సంస్థ కమిషనరు బాపిరాజు, తహసీల్దార్ శ్రీనివాస్, జనసేన నేత బండి రామకృష్ణ, గోపు సత్యనారాయణరావు, గొర్రెపాటి గోపీచంద్, మోటమర్రి బాబాప్రసాద్ ఎండీ ఇలియాజ్ బాషా, పిప్పళ్ల కాంతారావు హైనీ హైస్కూలు యాజమాన్య ప్రతినిధులు జాషువా ప్రసన్న కుమార్, లింగం మోజెస్, వైట్ గ్లోరీ తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు మొక్కలు నాటారు.

మాతా శిశు మరణాలు నివారించాలి

▸ సహేతుక కారణాలు లేని మరణాలకు వైద్యాధికారులదే బాధ్యత : కలెక్టర్ సృజన



కృష్ణలంక, ఆగస్టు 30 : సహేతుక కారణాలు లేని మాతా శిశు మరణాలకు వైద్యాధికారులే బాధ్యత వహించాల్సి వుంటుందని, మరణాలలో వైద్యుల లోపం గుర్తిస్తే చర్యలకు వెనుకాడబోమని, మాతా శిశు ఆరోగ్యం ప్రాణాపాయ పరిస్థితి వరకు తీసుకువచ్చి చివరి దశలో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి పంపడం సరికాదని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.సృజన వైద్యాధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఈ ఏడాది జూన్ నెలలో అనారోగ్య కారణాలతో సంభవించిన మాతా శిశు మరణాలపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మాతా శిశు మరణాలపై తూతూమంత్రంగా సమీక్షలు నిర్వహించడం నిష్ప్రయోజనమన్నారు. ప్రభుత్వపరంగా అన్నిచర్యలు తీసుకొంటున్నప్పటికీ మరణాలు సంభవించడం బాధాకరమన్నారు. జూన్ మాసంలో ముగ్గురు తల్లులు, ఒక శిశువు మరణించడం జరిగిందన్నారు. వారిలో వాసంతికి సంబంధించి 4 నెలలు గడిచినప్పటికీ పోస్టుమార్టం నివేదిక ఇప్పటికీ ఇవ్వలేదని, ఈ కేసుపై సమీక్ష ఎలా నిర్వహించాలో చెప్పాలన్నారు. ఇక నుంచి ప్రతి కేసుపై పూర్తి సమాచారంతో సమీక్షకు హాజరుకావాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. వైద్యుల నిర్లక్ష్యం వల్లే మరణాలు సంభవిస్తున్నాయనే భావన ప్రజల్లో కలగరాదన్నారు. వైద్యుల నిర్లక్ష్యంతో మరణాలు సంభవించినట్టు గుర్తిస్తే సంబంధిత వైద్యాధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకొనేందుకు కూడా వెనుకాడేది లేదని కలెక్టర్ సృజన తెలిపారు. సమావేశంలో డీఎంఅండ్ హెచ్‌వో డాక్టర్ ఎం.సుహాసిని, జీజీహెచ్ వైద్యులు ఆర్.సౌజన్య, సబిత, మదీనా అహ్మద్, సిద్ధార్థ మెడికల్ కళాశాల వైద్యురాలు ఎస్.సుమతి, డిస్ట్రిక్ట్ ఇమ్యూనైజేషన్ ఆఫీసర్ అమృతద, డిప్యూటీ డీఎంహెచ్‌వో జె.హిందుమతి, టీబీఎంవో పద్మావతి, ఫాగ్సి ప్రతినిధి ప్రభాదేవి, పీహెచ్‌సీ వైద్యులు అనిల్‌కుమార్, షేక్ ఖాజా ఇనయతుల్లా, పి.భార్గవి, ఐసీడీఎస్ సీడీపీవో జి.మంగమ్మ, సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

ప్రకృతి సేద్యానికి చేయూత

కృష్ణలంక : ఆరోగ్యకర జీవనానికి స్వచ్ఛమైన ఉత్పత్తులు అందించడంతో పాటు పర్యవరణానికి కొండంత మేలు చేసే ప్రకృతి సేద్యం చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్న రైతులకు సహాయ సహకారాలు అందించడం జరుగుతోందని కలెక్టర్ జి.సృజన అన్నారు. నాన్ పెస్టిసైడ్ మేనేజ్‌మెంట్ (ఎన్‌పీఎం) దుకాణం ఏర్పాటు ద్వారా కషాయాలు, విత్తనాలు, లింగార్షక బుట్టలు వంటివాటిని ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు అందించేందుకు జి.కొండూరు మండలం, చెవుటూరు గ్రామానికి చెందిన కంభంపాటి రమాదేవికి డీఆర్‌డీఏ ఆర్థిక సహకారం అందించింది. దీనికి సంబంధించిన చెక్కును శుక్రవారం కలెక్టర్ సృజన, జేసీ నిధి మీనా, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావుతో కలిసి అందజేశారు. ఇటీవల కలెక్టర్ సృజన జి.కొండూరు మండలం, చెవుటూరు గ్రామంలో పర్యటించి గ్రామపరిధిలోని రైతులు అనుసరిస్తున్న జీరో బడ్జెట్ ప్రకృతి వ్యవసాయ (జెడ్‌బీఎన్‌ఎఫ్) విధానాలను పరిశీలించారు. కొన్నేళ్లుగా ఈ ప్రాంతానికి చెందిన రైతులు, కౌలు రైతులు ప్రకృతి సైద్యాన్ని ఆచరిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఎలాంటి రసాయన ఎరువులు, పురుగుమందులు వాడకుండా జీవామృతం, వివిధ కషాయాలను ఉపయోగించి చేసే సాగుతో మంచి ఫలితాలు సాధిస్తున్నారు. అయితే ఈ సేద్యానికి అవసరమయ్యే కషాయాలు వంటివి తయారుచేసుకోలేని వారికి వీలుగా డీఆర్‌డీఏ వంటి శాఖల ద్వారా ఔత్సాహిక రైతులతో దుకాణాల ద్వారా విక్రయానికి చొరవ చూపనున్నట్టు కలెక్టర్ సృజన తెలిపారు. ఈ నేపధ్యంలోనే శుక్రవారం స్వయం సహాయక సంఘ సభ్యురాలు కంభంపాటి రమాదేవికి సహాయం అందజేశారు.

యూపీఎస్సీ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

▸ డీఆర్‌ఓ శ్రీనివాసరావు



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌ఓ శ్రీనివాసరావు

కృష్ణలంక, ఆగస్టు 30 : సెప్టెంబరు 1వ తేదీ ఆదివారం నిర్వహించనున్న యూపీఎస్సీ పరీక్షలను ఎటువంటి లోటుపాట్లు లేకుండా నిర్వహించాలని డీఆర్‌వో వి.శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) పరీక్షల నిర్వహణపై శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వెన్యూ సూపర్‌వైజర్లు, లైజన్ ఇన్స్పెక్టింగ్ అధికారులతో డీఆర్‌వో శ్రీనివాసరావు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సెప్టెంబరు 1వ తేదీ ఆదివారం నేషనల్ డిఫెన్స్ అకాడమీ (ఎన్డీఏ), నేవల్ అకాడమీ (ఎన్ఏ), సీడీఎస్ (కంబైండ్ డిఫెన్స్ సర్వీస్) పరీక్షలను యూపీఎస్సీ నిర్వహించనుందని తెలిపారు. జిల్లావ్యాప్తంగా 1420 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరుకానున్నారని, ఇందుకు 4 కేంద్రాలను సిద్ధం చేసినట్టు చెప్పారు. నేషనల్ డిఫెన్స్ అకాడమీ (ఎన్డీఏ), నావెల్ అకాడమీ(ఎన్ఏ) పరీక్షలు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు వుంటుందన్నారు. కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్ (సీడీఎస్) పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు, మధ్యాహ్నం 12 గంటల నుంచి 2 గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతాయని తెలిపారు. పరీక్షల నిర్వహణ కోసం ఐదుగురు రూటు అధికారులతో పాటు ఐదుగురు లైజన్ అధికారులను నియమించినట్టు చెప్పారు. ఇప్పటికే పరీక్షా పత్రాలను స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపరచడం జరిగిందని అన్నారు. సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకొనేలా రూటు అధికారులు చర్యలు తీసుకోవాలని, అలాగే పోలీస్, తపాలా, వైద్యఆరోగ్యం, ఏపీఈపీడీసీఎల్, జీవీఎంసీ తదితర శాఖలు వారికి అప్పగించిన విధులను తూచ తప్పకుండా పాటించాలని చెప్పారు. అభ్యర్థులకు అందుబాటులో తాగునీరు, విద్యుత్‌కు అంతరాయం లేకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు ఎటువంటి అసౌకర్యం కలగరాదని, ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో ప్రిన్సిపాల్స్, లైజన్, పోలీస్, తపాలా, వైద్యఆరోగ్యం, ఏపీఈపీడీసీఎల్, జీవీఎంసీ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

'నీరు-చెట్టు' బకాయిలు చెల్లించండి

▸ మంత్రి పయ్యావులకు ఆళ్ల వినతి

అజిత్‌సింగ్‌నగర్, ఆగస్టు 30 : 'నీరు చెట్టు' పనుల కోర్టు కేసులకు సంబంధించి పెండింగ్ బిల్లులు చెల్లించాలని సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు, చెన్నుపాటి శ్రీధర్, కవులూరు రాజా చంద్రమౌళి తదితరులు మంత్రి పయ్యావుల కేశవ్‌కు వినతిపత్రం అందజేశారు. విజయవాడ ఎంజీ రోడ్డులోని పంచాయతీరాజ్ అతిధిగృహంలో శుక్రవారం ఆర్థిక శాఖా మంత్రి పయ్యావుల కేశవ్, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడులు జలవనరుల శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ 'నీరు-చెట్టు' పెండింగ్ బిల్లుల ఫిర్యాదుల విభాగం, సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు తదితరులు పెండింగ్ బిల్లు చెల్లింపులకు సంబంధించి పూర్తి వివరాలతో మంత్రి పయ్యావుల కేశవ్‌కు వినతిపత్రం అందజేశారు.

నిష్పక్షపాతంగా దర్యాప్తు చేపట్టాలి : వెనిగండ్ల

గుడివాడ: గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాల ఘటన పట్ల ఎమ్మెల్యే వెనిగండ్ల రాము దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పోలీసులు నిష్పక్షపాతంగా దర్యాప్తు చేపట్టాలని, ఘటన వెనుక ఎంతటి వారు ఉన్నా ఉపేక్షించే ప్రసక్తే లేదన్నారు. విద్యార్థులు ఆందోళన చెందవద్దని, ఎమ్మెల్యే శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

జ్యుడీషియల్ ఎంక్వైరీ చేయాలి : సీపీఎం

గుడ్లవల్లేరు కళాశాల ఘటనపై జ్యుడీషియల్ ఎంక్వైరీ వేయాలని, బాధ్యులను కఠినంగా శిక్షించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి ఆర్‌సీపీ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గురువారం రాత్రి నుంచి విద్యార్థినులు ఆందోళన చేస్తున్నా పట్టించుకోవడం లేదని, వాస్తవాలను తల్లిదండ్రులకు చెప్పాల్సిన బాధ్యత కళాశాల యాజమాన్యంపై ఉందన్నారు.

చెరువులోపడి యువకుడు మృతి

పెడన, ఆగస్టు 30 : కాకర్లమూడి గ్రామానికి చెందిన యువకుడు ప్రమాదశాత్తు చెరువులోపడి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాకర్లమూడి గ్రామానికి చెందిన పరసా మామిళ్లరావు (28) గురువారం పశువులను తోలుకువెళ్లిన మామిళ్లరావు కొత్తపూడి రోడ్డులోని మూడు ఎకరాల పంచాయతీ చెరువులోకి పశువులు దిగడంతో వాటిని తోలడానికి దిగి ప్రమాదవశాత్తూ మునిగిపోయాడు. మృతుడి తండ్రి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ లక్ష్మణరావు శుక్రవారం ఉదయం కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బందరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

విద్యుదాఘాతంతో.. ఒకరు

చందర్లపాడు: ప్రమాదవశాత్తు విద్యుత్ తీగెలు తగిలి వ్యక్తితో పాటు రెండు గేదెలు మృతి చెందాయి. చందర్లపాడు గ్రామానికి చెందిన కుమార్(55) శుక్రవారం పశువులను తోలుకొని స్థానిక జగనన్న కాలనీ వైపు వెళ్లాడు. ఆసమయంలో విద్యుత్ తీగె పడి ఉండటంతో గేదెలు షాక్ కు గురై కింద పడ్డాయి. అది గమనించిన కుమార్ విషయం తెలియక గేదెలను పట్టుకోవడంతో షాక్ గురై అక్కడిక్కడే మరణించాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

హద్దు మీరితే కఠిన చర్యలు

▸ కూపన్లు లేని, అధికలోడు వాహనాలను సీజ్ చేస్తాం ▸ కీసర, మోగులూరు ఇసుక డంపింగ్ యార్డుల్లో ఆర్డీవో తనిఖీలు

కంచికచర్ల రూరల్, ఆగస్టు 30 : స్టాక్ పాయింట్లలో నిబంధనలకు విరుద్ధంగా ఇసుక లోడింగ్ చేస్తే చర్యలు తప్పవని నందిగామ ఆర్డీవో రవీంద్ర అధికారులను హెచ్చరించారు. కంచికచర్ల మండలం మోగులూరు, కీసర ఇసుక స్టాక్ పాయింట్లను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అధికారుల పనితీరుపై ఆర్డీవో అసహనం వ్యక్తం చేశారు. స్టాక్ పాయింట్ల వద్ద అందరూ సమన్వయంతో పనిచేసి నిబంధనల మేరకు ఇసుకను సక్రమంగా పంపిణీ చేయాలని ఆదేశించారు. కూపన్లు లేకుండా స్టాక్ పాయింట్లలోనికి వాహనాలు ప్రవేశిస్తే అధికారులపై చర్యలు తప్పవన్నారు. వాహనాలను పోలీసులు, ఎస్‌ఈబీ అధికారులు క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. పరిమితి మించి లోడింగ్ చేసుకునే వాహనాలను సీజ్ చేసి కేసులు నమోదు చేయాలన్నారు.



ఇసుక డంపింగ్ యార్డ్ వద్ద వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఆర్డీవో రవీంద్ర

1.5 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక గల్లంతు!

ఇసుక పంపిణీ ప్రారంభించే నాటికి కీసర స్టాక్ పాయింట్‌లో 2.25 లక్షల మెట్రిక్ టన్నులు, మోగులూరులో 1.39 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుకను అధికారులు సిద్ధంగా ఉంచారు. మోగులూరు స్టాక్ పాయింట్‌లో 70.5 వేల మెట్రిక్ టన్నుల ఇసుక పంపిణీ చేయగా ప్రభుత్వానికి రూ.2.03 కోట్ల ఆదాయం లభించింది. కీసర స్టాక్ పాయింట్‌లో గురువారం నాటికి 82.2 వేల మెట్రిక్ టన్నుల ఇసుకను పంపిణీ చేయగా రూ.2.38 కోట్ల ఆదాయం లభించింది. కీసర స్టాక్ పాయింట్‌లో ఇంకా 1.42 లక్షల టన్నుల ఇసుక ఉండాల్సి ఉండగా.. క్షేత్రస్థాయిలో 40వేల నుంచి 50వేల మెట్రిక్ టన్నులు మాత్రమే ఉందని అధికారులు అంటున్నారు. మిగిలిన లక్ష టన్నుల ఇసుక ఏమైనట్టని అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. మోగులూరు పాయింట్ వద్ద 40-45 వేల మెట్రిక్ టన్నుల ఇసుక మాత్రమే స్టాక్ ఉందని అధికారులు చెబుతున్నారు. రెండు పాయింట్ల వద్ద సుమారు 1.5 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక గల్లంతయి ఉంటుందని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ మొత్తం గోల్‌మాల్ ఎవరి కనుసన్నల్లో జరిగింది అనేది మిలియన్ డాలర్ల ప్రశ్నగా ఉంది. స్టాక్ పాయింట్‌ల వద్ద ఇన్‌చార్జిలుగా ఉన్న అధికారుల పాత్ర ప్రశ్నార్థకంగా మారింది. తనిఖీల్లో తహసీల్దార్ జాహ్నవి, రూరల్ సవాన్, ఎస్‌ఈబీ, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యా బోధన అందించాలి



గన్నవరం, ఆగస్టు 30 : విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధన అందించాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల సెక్రటరీ వి.ప్రసన్న వెంకటేష్ ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలోని వీరపనేనిగూడెం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలను ఆయన శుక్రవారం సందర్శించారు. గురుకుల పాఠశాలలోని అన్ని గదులను పరిశీలించి, 10వ తరగతి విద్యార్థులతో మాట్లాడి వారి సామర్థ్యాన్ని తెలుసుకున్నారు. ఇంటర్ యూనిట్ పరీక్షలను పరిశీలించారు. ప్రిన్సిపాల్ వై.యశోదలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎంయూఏ నిరసన



నిరసన తెలుపుతున్న ఆర్టీసీ ఉద్యోగులు

ఉయ్యూరు, ఆగస్టు 30 : ఏపీఎస్‌ఆర్టీసీ సంస్థ ఉద్యోగుల పట్ల సబ్‌ట్రెజరీ అధికారుల నిర్లక్ష్య, ఉదాసీన వైఖరికి నిరసనగా నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్(ఎన్ఎంయూఏ) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఉయ్యూరులో శుక్రవారం ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి డిపో గేటు ఎదుట నిరసన తెలిపారు. యూనిటీ అసోసియేషన్ డిపో కార్యదర్శి పెరవలి మురళీకృష్ణ ఈ సందర్భంగా మాట్లాడుతూ, డ్రైవర్లు, కండక్టర్లకు ఈనెల జీతంలో నైట్‌అవుట్ అలవెన్స్, ఇతర అలవెన్స్‌లు ప్రభుత్వ జీవో ప్రకారం ఈ నెల జీతంలో కలపకుండా నిలిపివేయడం ట్రెజరీశాఖ ఉన్నతాధికారుల ఉదాసీన వైఖరికి నిదర్శనమన్నారు. నిరసనలో భాగంగా ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. అసోసియేషన్ నాయకులు ఆవుల సాంబశివరావు, రమేశ్, షఫీ, పిచ్చయ్య, పాండవులు, ప్రసన్న, ఎల్ఎస్‌రావు, రజనీకాంత్, కోటి, శ్రీనివాస్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



బాపులపాడులో పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ

హనుమాన్‌జంక్షన్, ఆగస్టు 30 : ఇంటి పరిసరాలను ఎవరికివారు శుభ్రంగా ఉంచుకున్నపుడే దోమలు పెరగకుండా నివారించుకోవచ్చని తద్వారా డెంగ్యూ, మలేరియా లాంటి వ్యాధులను దూరం చేసుకోవచ్చని జిల్లా మలేరియా అధికారి బి.రామారావు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం డ్రై డే పురస్కరించుకొని బాపులపాడు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో గ్రామంలో మలేరియా అధికారి ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. పలు వీధుల్లో ఆయన ఇంటింటికి వెళ్లి పరిసరాలను పరిశీలించారు. దోమలు నివాసం ఉండకుండా ఇంటి పరిసరాలను డ్రైగా ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ సీహెచ్‌వో ఫణికుమార్, హెల్త్‌అసిస్టెంట్ నాగరాజు, ఏఎన్ఎం, ఆశా వర్కర్లు తదితర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి



ఉయ్యూరు ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులను పరామర్శిస్తున్న సీపీఎం నాయకులు

ఉయ్యూరు : ప్రభుత్వ వైద్యశాలలో జ్వరాలు, ఇతర సీజనల్ వ్యాధులతో చికిత్స పొందుతున్న వారికి మెరుగైన వైద్యం అందించాలని సీపీఎం ఉయ్యూరు పట్టణ కార్యదర్శి బి.రాజేశ్ డిమాండ్ చేశారు. పార్టీ నాయకులతో కలసి ఉయ్యూరు ప్రభుత్వ వైద్యశాలను శుక్రవారం సందర్శించి వైరల్ జ్వరాలు, సీజనల్ వ్యాధులతో బాధపడుతూ వైద్యశాలలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించి అందుతున్న వైద్యసేవలపై రోగులను అడిగి తెలుసుకున్నారు. పార్టీ సీనియర్ నాయకుడు అన్నే సుబ్బారావు, పడాల లక్ష్మణరావు, టి.లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

వీరాస్వామి మృతి బాధాకరం



వీరాస్వామి భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

పెనమలూరు, ఆగస్టు 30 : ప్రముఖ టీడీపీ నాయకుడు, పార్టీ తాడిగడప మునిసిపాలిటీ ప్రధాన కార్యదర్శి అంగిరేకుల మురళి సోదరుడు వీరాస్వామి మృతి బాధాకరమని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం అంగిరేకుల వీరాస్వామి భౌతికకాయానికి ఎమ్మెల్యే నివాళులర్పిస్తూ వీరాస్వామి మృతి పట్ల ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ సీనియర్ నాయకులు అనుమోలు ప్రభాకరరావు తదితరులు ఉన్నారు.

ఘనంగా పరిటాల రవి జయంతి

ఉయ్యూరు, ఆగస్టు 30 : టీడీపీ సీనియర్ నాయకుడు, సర్దార్ గౌతు లచ్చన్న సేవాసమితి అధ్యక్షుడు కాగిత కొండ ఆధ్వర్యంలో శుక్రవారం పరిటాల రవీంద్ర జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. పార్టీ నాయకులు పామర్తి శివ, కె. విజయ్‌కుమార్, వీరంకి శివాజీ, పృధ్వీరాజ్, ప్రకాశ్, జనసేన నాయకుడు కె.శ్రీను తదితరులు పాల్గొన్నారు.



రవి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న టీడీపీ నేతలు

రోడ్ల అభివృద్ధికి ప్రాధాన్యం

ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

గన్నవరం, ఆగస్టు 30 : నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామని, ప్రాధాన్యతాక్రమంలో రోడ్ల అభివృద్ధి పనులు చేపడుతున్నామని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. బీబీగూడెం- ఆగిరిపల్లి రోడ్డు మరమ్మతుల పనులను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లే ఆర్‌అండ్‌బీ రోడ్లు అధ్వానంగా మారాయన్నారు. ఈ రోడ్డులో ప్రయాణం చేయాలంటే ప్రజలు నరక యాతన పడుతున్నారన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఈ రోడ్డుకు రూ.29కోట్లు మంజూ రయ్యాయని అప్పటి వైసీపీ ప్రభుత్వం స్పందించక పోవటంతో వచ్చిన నిధులు కూడా వెనక్కి వెళ్లిన పరిస్థితి ఉందన్నారు. కాంట్రాక్టర్ యలమంచిలి వెంకటరత్నం కొంత మేర పనులు చేసిన ప్పటికీ పైసా కూడా ఇవ్వలేదని, ఈ రోడ్డు దుస్థితి గురించి ప్రజలు విన్నవించటంతో వెంటనే వెంకటరత్నంతో మాట్లాడగా మరమ్మతులు చేసేందుకు ముందుకు వచ్చారని చెప్పారు. రూ.20 లక్షల వ్యయంతో యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టడం అభినందనీయమన్నారు. తనపై నమ్మకంతో పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్ యలమంచిలి వెంకటరత్నం గొప్ప ఉదారవాది అని చెప్పారు.



రోడ్డు మరమ్మతు పనులకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

మల్లవల్లి పారిశ్రామిక కారిడార్‌ను అన్ని విధాల అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు 260 మంది పారిశ్రామిక వేత్తలు ముందుకు వచ్చారని కానీ వారికి సెంటు స్థలం కూడా ఇవ్వలేని స్థితికి గత వైసీపీ ప్రభుత్వం తీసుకువచ్చిందని విమర్శించారు. వెయ్యి ఎకరాలకుపైగా భూములిస్తే పారిశ్రామిక వేత్తలు పరిశ్రమలు పెట్టేందుకు ముందుకు వస్తున్నారని, అది తన పనితీరుకు నిదర్శనమన్నారు. రాబోయే కాలంలో గన్నవరం దశ, దిశ మారు స్తానని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు హామీ ఇచ్చారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దొంతు చిన్న, బోయపాటి బసవపూర్ణయ్య (బుల్లియ్య), మండవ లక్ష్మీ, మేడేపల్లి రమాదేవి, బోయపాటి మురళీకృష్ణ (బుల్లియ్య), బొర్రా శ్రీనివాసరావు, గుజ్జర్లపూడి వెంకటేశ్వరరావు, సాంబశివరావు, సామలచిన వెంకటేశ్వరరావు, తొమ్మండ్రు రవీంద్ర, కాట్రు రాజేష్, పాలడుగు నాని, కాసన్నేని రంగబాబు, యనమదల సతీష్, పడమట రంగారావు, తుమ్మల లక్ష్మణరావు, మాదల సాంబశివరావు పాల్గొన్నారు.



ఆర్డీవో కార్యాలయం వద్ద మొక్క నాటుతున్న ఆర్డీవో రాజు, తహసీల్దార్

మొక్కలు నాటి సంరక్షించాలి

ఉయ్యూరు, ఆగస్టు 30 : పచ్చని చెట్టు ప్రగతికి సోపాన మార్గమని గుర్తెరిగి ప్రతి ఒక్కరూ వన సంరక్షణ చేపట్టి మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యతగా తీసుకోవాలని ఉయ్యూరు ఆర్డీవో డి.రాజు అన్నారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో తహసీల్దార్‌తో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడు తూ, విచక్షణారహితంగా చెట్లు నరికివేయడం వల్ల వాతావరణ సమతుల్యత దెబ్బతింటుందన్నారు.

● ఉయ్యూరు నగరపంచాయతీ ఆధ్వర్యంలో స్థానిక జడ్పీ స్కూల్ ఆవరణలో ఛైర్మన్ వి.సత్యనారాయణ, కమిషనర్ వెకంటేశ్వరరావు, డీవైఈవో పద్మారాణితో కలసి మొక్కలు నాటారు. విద్యార్థులు మొక్కలునాటి సంరక్షించడం అలవరుచుకోవాలన్నారు.హెచ్‌ఎం కె.జ్యోత్స్నదేవి, పీడీ రమణ పాల్గొన్నారు.

ఆలయాలకు శ్రావణ శుక్రవారం శోభ

గన్నవరం, ఆగస్టు 30 : పాత గన్నవరం లక్ష్మీ తిరుపతమ్మ ఆలయంలో శుక్రవారం శ్రీవరలక్ష్మీ దేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. శ్రావణమాసం చివరి శుక్రవారం సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారిని వరలక్ష్మీదేవిగా అలంకరించారు. తొలుత భక్తులచే శ్రీలలిత సహస్ర నామ పారాయణం, శ్రీలక్ష్మీ అష్టోత్తరం జరిపారు. అనంతరం గ్రామ పొంగళ్లను డప్పు వాయిద్యాల మధ్య ఊరేగింపుగా తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించారు. నెల రోజులుగా జరుగుతున్న శ్రీలక్ష్మీ సహస్రనామ పారాయణం సెప్టెంబరు 2న ముగిస్తుందని ఆలయ కమిటీ అధ్యక్షుడు జాస్తి శ్రీధర్ తెలిపారు. జాస్తి ఫణి, కాసరనేని నాని, జాస్తి సీతయ్య చౌదరి, పి. శివలీల, జాస్తి శ్రీనివాసరావు, నర్రా గిరిధర్ తదితరులు పాల్గొన్నారు. యాదవుల రామాలయంలో అర్చకులు శర్మ ఆధ్వర్యంలో సామూహిక వరలక్ష్మీవ్రతాలు నిర్వహించారు.

పేరంటాలమ్మ ఆలయంలో..

గుణదల : శ్రావణమాసం చివరి శుక్రవారం కావడంతో రామవరప్పాడులోని వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో నిర్వహించిన సామూహిక వరలక్ష్మీవ్రతాలకు విశేష స్పందన వచ్చింది. ఉదయం నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చి సామూహిక వరలక్ష్మీవ్రతంలో పాల్గొనేందుకు బారులు తీరారు. ఆలయ అర్చకులు మహిళలందరిచే ఏకాలంలో మంత్రోచ్ఛరణ చేస్తూ ఒకేసారి అందరిచేత వరలక్ష్మీవ్రతం చేయించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులందరికీ పసుపు, కుంకుమ, గాజులు, పువ్వులు అమ్మవారి ప్రసాదంగా ఆలయ కార్యనిర్వహణ అధికారిణి పాతూరి లోకేశ్వరి అందజేశారు.





గన్నవరం తిరుపతమ్మ తల్లి ఆలయంలో పూజలు.. రామవరప్పాడు పేరంటాలమ్మ ఆలయంలో..

గోదాదేవికి పుష్పాభిషేకం

హనుమాన్‌జంక్షన్ : స్థానిక నూజివీడు రోడ్డులోని లక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో గోదాదేవికి శుక్రవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. శ్రావణమాసం ఆఖరి శుక్రవారం పురస్కరించుకొని అమ్మవారికి 108 పూల బుట్టలు సమర్పించారు. అర్చకులు చక్రావధానుల సీతారామాచార్యులు భక్తులు సమర్పించిన పూలతో అమ్మవారికి అభిషేకం జరిపారు. అనంతరం వరలక్ష్మీవ్రతం నిర్వహించారు. అమ్మ వారికి ఆలయ ట్రస్టీ కాకాని అరుణబాబు దంపతులు పట్టువస్త్రాలు సమర్పించారు.





జంక్షన్ లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో.. పసుపు కొమ్ములతో జగదాంబ అలంకరణ

కన్యకా పరమేశ్వరీ ఆలయంలో

స్థానిక ఏలూరు రోడ్డు ఆర్యవైశ్య కల్యాణ మండపంలోని వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయంలో శ్రావణమాసం ఆఖరి శుక్రవారం పురస్కరించుకొని వాసవీమాత అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు బొమ్మిశెట్టి రామారావు, చామర్తి రాంబాబు, శ్రీనివాసరావు, నారికమల్లి శివబ్రహ్మం, వెచ్చా వెంకటేశ్వరరావు, తవ్వా రాంబాబు, పాబోలు బదరీనాథ్, పాబోలు సుధాకర్, కృష్ణారావు, నారికమల్లి ప్రసాద్, సత్యలక్ష్మీశేషుకుమారి, కాళిమ్మ తదితరులు పాల్గొన్నారు.

జగదాంబకు పసుపు కొమ్ములతో..

ఉయ్యూరు : సోమేశ్వరస్వామి ఆలయంలో శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని శ్రీజగదాంబ అమ్మ వారిని శ్రీలలిత పారాయణ భక్తబృందం ఆధ్వర్యంలో పసుపుకొమ్ములతో అలంకరించారు. ఈ సందర్భంగా లలితా సహస్రనామ పారాయణం, పూజలు, కుంకు మార్చనలు చేశారు. వర్షాన్ని సైతం లెక్కచేయక భక్తులు వేకువ జాము నుంచి తరలివచ్చి అమ్మవారిని దర్శించి పూజలు చేశారు.

క్రీడాకారులను ప్రోత్సహించాలి



క్రీడాకారులకు టీషర్టులు అందజేస్తున్న కేవీ రమణ

గన్నవరం, ఆగస్టు 30 : క్రీడల్లో రాణిస్తున్న క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కేవీఆర్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఛైర్మన్ కేవీ రమణ, కార్యదర్శి కేవీఆర్ కిషోర్ పిలుపునిచ్చారు. స్థానిక జడ్పీ బాలుర హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో వాలీబాల్ క్లబ్ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన క్రీడాకారులకు శుక్రవారం కేవీఆర్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ద్వారా టీ షర్టులు, స్పోర్ట్స్ కిట్ అందజేశారు. ఈ సందర్భంగా రమణ, కిషోర్ మాట్లాడుతూ, గన్నవరం ప్రాంతం క్రీడలకు పుట్టినిల్లు వంటిదన్నారు. ఈ ప్రాంతానికి చెందిన ఎంతో మంది క్రీడాకారులు జాతీయ అంతర్జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు సాధించారని, వీరి స్ఫూర్తితో గ్రామీణ క్రీడలను, క్రీడాకారులను ప్రోత్సహించడమే లక్ష్యంగా తమ అసోసియేషన్ పని చేస్తుందన్నారు. దీనిలో భాగంగా క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్న క్రీడాకా రులను గుర్తించి తగిన శిక్షణ సహకారం అందిస్తున్నట్లు చెప్పారు. ముఖ్యంగా క్రీడా ప్రాంగణంలో వాలీబాల్ క్లబ్‌ను ఏర్పాటు చేసి ఉత్తమ క్రీడాకారులుగా యువతను తీర్చిదిద్దుతున్న నిర్వాహకులను అభినందించారు. వాలీబాల్ క్లబ్‌కు చెందిన రామారావు, చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న ఎంఈవో సాంబశివరావు

పోక్సో చట్టంపై అవగాహన

ఉంగుటూరు, ఆగస్టు 30 : పిల్లలకు రక్షణ కల్పించడంకోసం కేంద్రప్రభుత్వం తీసుకొచ్చిన పోక్సో చట్టంపై ఉపాధ్యాయులందరూ అవగాహన పెంచుకోవాలని జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ (డీసీపీవో) మానీషా అన్నారు. ఐసీడీఎస్, విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల హెచ్ఎంలకు శుక్రవారం స్థానిక మండల రిసోర్స్ సెంటర్‌లో పోక్సో చట్టం నిబంధనలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంఈవో-2 జె.సాంబశివరావు చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీ మెంబర్ శ్యామల, డిప్యూటీ తహసీల్దార్ శ్రీలత, తదితరులు బాలల హక్కులు, చట్టాలపై వివరించారు.

బీటెక్ విద్యార్థికి మానవత ఆర్థికసాయం

హనుమాన్‌జంక్షన్, ఆగస్టు 30 : పేద విద్యార్థులకు మానవత సహకారం ఎల్లప్పుడు ఉంటుందని మానవత రాష్ట్ర అధ్యక్షుడు మారుబోయిన కోటేశ్వరరావు తెలిపారు. శుక్రవారం స్థానిక మానవత కార్యాలయంలో వీరవల్లి గ్రామానికి చెందిన ఇంజనీరింగ్ విద్యార్థి పర్వతనేని షణ్ముఖసాయి ఆదిత్యకు మానవత హనుమాన్ జంక్షన్ శాఖ కాలేజీ ఫీజు నిమిత్తం రూ.10 వేలు ఆర్థికసాయం అందజేశారు. జేవీవీ సత్యనారాయణ, నారగాని కొండలరావు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి

ఉయ్యూరు, ఆగస్టు 30 : ఏకీకృత పెన్షన్ స్కీమ్‌ను రద్దు చేసి పాత పెన్షన్ పునరుద్ధరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఉపాధ్యాయులు నిరసన ప్రదర్శన చేశారు. ఫెడరేషన్ నాయ కుడు పీవీ రమణ ఈ సందర్భంగా మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఏకీకృత పెన్షన్ స్కీమ్ రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. అనంతరం తహసీల్దార్ సురేశ్‌కుమార్‌ను కలసి మెమొరాండం అందజేశారు. కేపీ విశ్వమోహన్, విజయశ్రీ, అబ్దుల్ హబీబ్, పమిడేశ్వరరావు, ఇమ్మానుయేలు, జి. లక్ష్మణరావు, పార్థసారథి, శ్రీనివాసరావు, విష్ణు పాల్గొన్నారు.

గన్నవరం : ఏకీకృత పెన్షన్ స్కీమ్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్దరించాలని యూటీఎఫ్ జిల్లా కోశాధికారి మరీదు వరప్రసాద్ డిమాండ్ చేశారు. యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ శివయ్యకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వరప్రసాద్ మాట్లాడుతూ, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని పోరాటం చేస్తుంటే కేంద్ర ప్రభుత్వం అంకెల గారడీలతో ఒక కొత్త పెన్షన్ స్కీమ్‌ను తీసుకురావటం బాధాకరమన్నారు. పాతపెన్షన్ విధానాన్ని పునరుద్ధరించే వరకూ యూటీఎఫ్ పోరాటాలు చేస్తూనే ఉంటుందన్నారు. నాయకులు పి.ప్రసాదరావు, జివి రవిబాబు, తాతా శ్రీనివాస్, డి. శివప్రసాద్, జ్ఞానానందం, బాలశౌరి, చలపతిరావు, రంగారావు తదితరులు పాల్గొన్నారు.





ఉయ్యూరులో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు.. గన్నవరంలో..

బ్రాయిలర్ ధరలు
అమరావతి (కి.లో)

బ్రాయిలర్ బర్డ్	106, 115, 126
చికెన్ విత్ స్కిన్	204
చికెన్ స్కిన్‌లెస్	214

నెక్ కోడిగుడ్డు ధర
విజయవాడ జోన్ రైతు ధర రూ.5.25

జాతీయ అవార్డు గ్రహీత శ్రీనివాసరావుకు సత్కారం



గుడివాడ రూరల్ : జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న గుడివాడ ఎస్‌పీఎస్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు ఎం.శ్రీనివాసరావును గుడివాడ, నందివాడ, పెదపారుపూడి, గుడ్లవల్లేరు మండలాల ఎంఈవోలు గుడివాడలో శుక్రవారం ఘనంగా సత్కరించారు. ఆయనకు అభినందనలు తెలియజేశారు. ఎంఈవోలు ఇందుపల్లి విజయ్, భూక్యా బాలాజీ, డేవిడ్ రాజు, సురేష్ కుమార్, గోపాల్, గుడివాడ మండల కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విచక్షణారహితంగా ఎరువులు వాడొద్దు



విత్తనోత్పత్తిపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ శ్రీనివాసరావు

కూచిపూడి : విచక్షణా రహితంగా ఎరువులు, పురుగు మందులు వాడొద్దని జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ కె.శ్రీనివాసరావు సూచించారు. అయ్యంకిలో గ్రామీణ విత్తనోత్పత్తి పథకంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. విత్తనాలను ఎంపిక చేసుకుని, కేళిలను గుర్తించి తొలగించాలన్నారు. ఎరువులు, పురుగులు మందులు ఎక్కువగా వాడితే నష్టం జరిగే అవకాశాలు ఎక్కువ అన్నారు. రైతులు ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించినట్లైతే మేలైన పంటను సాధించవచ్చునని తెలిపారు. శాస్త్రవేత్త సుధారాణి, ఏవోలు శివప్రసాద్, పద్మజ, వీఏఏ రాజేష్ పాల్గొన్నారు.

రైతులందరికీ ఎరువులు అందేలా చర్యలు



గుడివాడ రూరల్ : రైతులందరికీ యూరియా అందేలా కృషి చేస్తామని, ఎరువులను అన్ని షాపులకు సక్రమంగా పంపిణీ చేస్తామని వ్యవసాయ శాఖ జేడీ పద్మావతి అన్నారు. రైల్వే స్టేషన్‌లో దిగుమతి అవుతున్న ఎరువులను ఆమె పరిశీలించారు. ఎరువులను డీలర్లు ఎక్కువ రేట్లకు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎరువుల కోసం వచ్చిన రైతులకు యజమానులు రశీదులు తప్పనిసరిగా అందజేయాలన్నారు. మార్క్‌ఫెడ్ డీడీ మురళీకృష్ణ, ఏడీఏ నిమ్మగడ్డ రమాదేవి పాల్గొన్నారు.

డయాలసిస్ రోగికి ఐవీఎం సురేష్ సాయం



చల్లపల్లి : చల్లపల్లికి చెందిన డయాలసిస్ రోగి పఠాన్ బాబులు వైద్యచికిత్స నిమిత్తం ఐవీఎం డైరెక్టర్ డా.వేములపల్లి సురేష్ ఆర్థిక సహాయం అందజేశారు. ఐవీఎం హోమ్‌లో బాబులు కుమారుడు పఠాన్ కరీముల్లా ఖాన్‌కు రూ.15 వేల చెక్కును అందించారు. వైద్యం కోసం సాయం చేసిన ఐవీఎం సురేష్‌కు పఠాన్ కృతజ్ఞతలు తెలిపారు.



పెడనలో మొక్క నాటుతున్న ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ | చల్లపల్లి గురుకుల కళాశాలలో.. | గుడివాడలో మొక్కలు నాటుతున్న రావి | ఉల్లిపాలెం పాఠశాలలో..

సామాజిక బాధ్యతగా మొక్కలు నాటాలి

పెడన, ఆగస్టు 30 : ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా మొక్కలు నాటాలని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ పిలుపునిచ్చారు. వనమహోత్సవంలో భాగంగా పురపాలక సంఘం ఆధ్వర్యంలో బొడ్డు నాగయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో శుక్రవారం కృష్ణప్రసాద్ మొక్కలు నాటారు. మొక్కలను నాటడంతోనే సరిపెట్టకుండా వాటిని సంరక్షించాల్సిన బాధ్యత కూడా తీసుకోవాలన్నారు. కమిషనర్ మన్నం గోపాలరావు, కళాశాల ప్రిన్సిపాల్ రామారావు, అధ్యాపకుడు పేరిశెట్టి నాగరవి, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ పామర్తి జితేంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు. **చల్లపల్లి :** పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని చల్లపల్లి సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, వైస్ ఎంపీపీ మోర్ల రాంబాబులు విజ్ఞప్తి చేశారు. వనమహోత్సవం సందర్భంగా శుక్రవారం చల్లపల్లి గురుకుల కళాశాలలో మొక్కలు నాటారు. ఎంపీడీవో సిహెచ్.చినరాట్నాలు, ఈవో పి.వి.మాధవేంద్రరావు, జనసేన నేతలు బొందలపాటి వీరబాబు, అడపా రవి, గోళ్ల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. **ఘంటసాల :** పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా మొక్కలు నాటాలని గ్రామపంచాయతీ సర్పంచ్ చలపాటి రాణి తెలిపారు. వన మహోత్సవంలో భాగంగా కొడాలి ఎస్టీ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో మొక్కలను నాటారు. పంచాయతీ కార్యదర్శి సిహెచ్.వి.ఎస్.నాగమణి, పంచాయతీ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. శ్రీకాకుళంలో ఎంపీటీసీ సభ్యుడు తాడికొండ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో జనసేన, టీడీపీ నాయకులు మొక్కలు నాటారు. **కోడూరు :** ఉల్లిపాలెం ఎంపీయూపీ పాఠశాల వద్ద వనమహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ ప్రధాన కూడళ్ల వద్ద, పాఠశాలల ప్రాంగణంలో విద్యార్థులు మొక్కలు నాటించారు. పధానోపాధ్యాయురాలు రాజనాల నీరజ, ఉపాధ్యాయులు కాశీభొట్ల నాగభూషణం, రేపల్లె నాగ జయప్రద, జన్ను పావని, శివనాగమణి పాల్గొన్నారు. **గుడివాడ :** గుడివాడలో వనం-మనం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు, తుమ్మల రాంబ్రహ్మం పార్కులో పురపాలక సంఘం ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు పాల్గొని మొక్కలు నాటారు. కమిషనర్ జి.బాలసుబ్రహ్మణ్యం, మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, మున్సిపల్ ఎంఈ విజయదుర్గ, డీఈ ప్రవీణ్, ఏఈ తేజశ్వినీ, కూటమి నాయకులు తులసీబాబు, జబీన్, సుధాకర్, సాంబయ్య, జగన్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు. బైపాస్ రోడ్డు ఉర్దూ పాఠశాలలో నవభారత్ ఖాదీ స్టోర్స్ అధినేత సయ్యద్ గఫార్ మొక్కలు నాటారు. సయ్యద్ జబీన్, పుట్టి హరికుమార్, ప్రధానోపాధ్యాయుడు చాంద్ రజా, నయిం, లతీఫ్ పాల్గొన్నారు.

విద్యార్థినుల సంరక్షణ బాధ్యత ఉపాధ్యాయులదే



కోడూరులో మాట్లాడుతున్న ఎస్సై శిరీష, పెడనలో మాట్లాడుతున్న ఎంఈవో దుర్గాప్రసాద్

కోడూరు : విద్యార్థినులను సంరక్షించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని ఎస్సై పి.శిరీష తెలిపారు. స్వతంత్రపురం జిల్లా పరిషత్ పాఠశాలలో మండల విద్యాశాఖ అధికారులు టి.వి.ఎం.రామదాసు, శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మండలంలోని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించే ఉపాధ్యాయులపై పోక్సో చట్టం కింద కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. **పెడన :** బాలికలు, మహిళలపై లైంగిక దాడులను అరికట్టేందుకు పోక్సో చట్టం, గుడ్ టచ్, బ్యాడ్‌టచ్‌లపై ఉపాధ్యాయులకు అవగాహనా సదస్సులు నిర్వహిస్తున్నామని ఎంఈవో ఎం.వి.ఎస్. దుర్గాప్రసాద్ అన్నారు. పట్టణంలోని షాదీఖానాలో పోక్సో చట్టం, గుడ్‌టచ్, బ్యాడ్ టచ్‌లపై ఉపాధ్యాయులకు శుక్రవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కల్పవల్లి, మిషన్ శక్తి టీం కౌన్సిలర్ సుప్రియ మాట్లాడుతూ, లైంగిక వేధింపులు ఎదురైనప్పుడు భయపడకుండా చైల్డ్ హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. ఎస్సై సత్యనారాయణ మాట్లాడుతూ, బాలికలు, మహిళలపై అత్యాచారాలకు పాల్పడే వారికి కఠిన శిక్షలు అమలయ్యేలా పోక్సో చట్టం రూపొందించారన్నారు. ఎంఈవో-2 వై.వి. హరనాథ్, ఉపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు. **బంటుమిల్లి :** విద్యార్థినీ విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనని వక్తలు పేర్కొన్నారు. బంటుమిల్లి జూనియర్ కాలేజీలో పోక్సో చట్టం, గుడ్ టచ్ - బ్యాడ్ టచ్ పట్ల అవగాహన కల్పించారు. ఎంఈవోలు త్రిపురసుందరి, వెంకటేశ్వరరావు, సీడీపీవో సముద్రవేణి, ఎస్సై గణేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి : యూటీఎఫ్

మచిలీపట్నం టౌన్ : సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. జె. లెనిన్‌బాబు, సిహెచ్. రాజాశ్రీధర్, కె. వెంకటేశ్వరరావు, నాగేంద్రరావు, ఎల్. వెంకటేశ్వరరావు, కె.వి. ప్రసాదరావు, శ్రీనివాసరావు, ఆర్. వెంకటేశ్వరరావు, ప్రసాదరావు పాల్గొన్నారు. తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రం సమర్పించారు. **అవనిగడ్డ :** సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. యూటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు బి.కనకరావు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. జిల్లా కార్యదర్శులు వెంకటేశ్వరరావు, సుభాషిణి, కె.జీవేంద్రరావు, శివరామకృష్ణ, తెనాలి శ్రీనుబాబు, శ్రీధర్, స్వామి, నరేంద్ర, సింహాద్రి శ్రీనివాసరావు, నడకుదుటి ఉమామహేశ్వరరావు, బేతి వెంకటేశ్వరరావు, విమల తదితరులు పాల్గొన్నారు. **గుడివాడ రూరల్ :** సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ పునరుద్ధరించాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయం వద్ద యూటీఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు నీలం ప్రభాకర్‌రావు ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఏవి.వరలక్ష్మి, ఆర్.సి.పి.రెడ్డి, రజని, అరుణ లక్ష్మణ్, శ్రీనివాస్, సతీష్, చంద్రశేఖర్, హరి, శ్రీనివాస్, అశోక్, రేఖుకల రావు, శేషగిరిరావు, అనిల్, రాజారావు, చలసాని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



బందరులో ఆర్టీసీ కార్మికుల నిరసన ప్రదర్శన | అవనిగడ్డ డిపో వద్ద ఆర్టీసీ కార్మికుల నిరసన

ట్రెజరీ వైఖరికి ఆర్టీసీ కార్మికుల నిరసన

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 30 : ట్రెజరీ అధికారుల వైఖరికి నిరసనగా నేషనల్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో ఆర్టీసీ డిపో వద్ద శుక్రవారం కార్మికులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. నేషనల్ మజ్దూర్ యూనియన్ డిపో అధ్యక్షుడు యు.వి. రావు, ఎం.కిరణ్‌కుమార్, ఎండి బాషా, కె. సంజయ్‌కుమార్, ఏ. అమరనాథ్ తదితరులు పాల్గొన్నారు. **అవనిగడ్డ :** సబ్ ట్రెజరీ అధికారుల వైఖరిని ఖండిస్తూ ఆర్టీసీ కార్మికులు అవనిగడ్డ డిపో వద్ద నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. రీజినల్ కార్యదర్శి కేసాని వెంకటేశ్వరరావు, డిపో అధ్యక్షుడు బాలాజీ, కార్యదర్శి కుమార్, ముద్రగడ్డ వెంకట పిచ్చేశ్వరరావు, పసుపులేటి శ్రీనివాసరావు, చింతయ్య పాల్గొన్నారు.



వీరాస్వామి దంపతులను సత్కరిస్తున్న డీఎం

గోవాడ వీరాస్వామి సేవలు అభినందనీయం

అవనిగడ్డ : గోవాడ వీరాస్వామి సేవలు అభినందనీయమని అవనిగడ్డ డిపో మేనేజర్ హనుమంతరావు అన్నారు. పదవీ విరమణ సందర్భంగా వీరాస్వామి - ఝాన్సీలక్ష్మీలను ఘనంగా సత్కరించారు. డీఎం మాట్లాడుతూ ఫైనాన్స్ సూపరింటెండెంట్‌గా వీరాస్వామి నిజాయితీతో పని చేశారన్నారు. ఆర్టీసీ కార్మికులు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు అధ్వానం...ఆటో బోల్తా

● విద్యార్థులకు తప్పిన ప్రమాదం

మచిలీపట్నం టౌన్ : బందరు మండలం కోన రహదారిలో ఆటో అదుపుతప్పి బోల్తా కొట్టింది. శివగంగలోని కాన్వెంట్ నుంచి 20 మంది విద్యార్థులతో కోన వెళ్తున్న ఆటో.. ఎదురుగా వస్తున్న వాహనానికి దారిచ్చే క్రమంలో రోడ్డు అధ్వానంగా ఉండడంతో అదుపుతప్పింది. పక్కకు ఒరిగి పోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. కృష్ణా విశ్వవిద్యాలయం సిబ్బంది ఆటోలో ఇరుక్కుపోయిన పిల్లలను బయటకు తీశారు. ఎవరూ గాయపడలేదు.

అధ్వానంగా ఉన్న రోడ్డును పునర్నిర్మించి ప్రమాదాల బారి నుంచి కాపాడాల్సిందిగా ప్రజలు కోరుతున్నారు.

విషపు గుళికలు తిని ఆత్మహత్య

కోడూరు : విషపు గుళికలు తిని ఉల్లిపాలెం గ్రామానికి చెందిన అరజా వెంకటేశ్వరరావు (57) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గుళికలు తిన్న వెంకటేశ్వరరావును అవనిగడ్డ ప్రభుత్వాసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై పి.శిరీష తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఆరుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

పామర్రు : ఎలకుర్రులో పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తుల్ని సీఐ శుభాకర్ ఆధ్వర్యంలో పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకుని వారి వద్ద రూ. 6,300 నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సిహెచ్ అవినాష్ తెలిపారు.

ఇసుక లారీ సీజ్

తోట్లవల్లూరు : భద్రిరాజుపాలెం కరకట్టపై గురువారం అర్ధరాత్రి ఒంటిగంటకు అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న లారీని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.అర్జునరాజు తెలిపారు. లారీ డ్రైవర్ ప్రదీప్‌రాజును అదుపులోకి తీసుకున్నామన్నారు. లారీ కొడాలికి చెందిన బండి యశ్వంత్‌దిగా గుర్తించామన్నారు.

పెడన కౌన్సిల్ సమావేశం నేడు

పెడన : పెడన మునిసిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం శనివారం ఉదయం 11.30 గంటలకు జరుగుతుందని కమిషనర్ ఎం. గోపాలరావు తెలిపారు. చైర్‌పర్సన్ కటకం నాగకుమారి అధ్యక్షతన జరిగే సమావేశంలో అజెండాలోని తొమ్మిది అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

ఎమ్మెల్యే కాగిత పరామర్శ

పెడన : అనారోగ్యంతో బాధపడుతున్న పోలవరానికి చెందిన సీనియర్ టీడీపీ నాయకుడు, చేనేత ప్రముఖుడు కారుపర్తి సుబ్బారావును ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ శుక్రవారం పరామర్శించారు. సుబ్బారావు త్వరితగతిన కోలుకోవాలని ఆకాంక్షించారు. పోలవరం మాజీ సర్పంచ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వికసిత్ ఆంధ్రప్రదేశ్ వాయిదా

గుడివాడ రూరల్ : లింగవరంలో జరగాల్సిన వికసిత్ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమం అనివార్య కారణాలతో వాయిదా పడింది. నందివాడ, గుడ్లవల్లేరు, గుడివాడ మండలాలకు చెందిన వివిధ శాఖల అధికారులతో శుక్రవారం సమీక్ష జరగాల్సి ఉండగా వాయిదా పడింది.

అగ్నిబాధితులకు సాయం

మచిలీపట్నం టౌన్ : చినకరగ్రహారంలో అగ్నిబాధిత వన్నెంరెడ్డి వనజ కుటుంబ సభ్యులకు శుక్రవారం చలమలశెట్టి చారిటబుల్ ట్రస్టు మేనేజరు చలమలశెట్టి పాండురంగారావు నిత్యావసర వస్తువులు, వంట సామాగ్రి, దుస్తులు అందజేశారు. జనసేన నాయకులు బి.పవన్‌కుమార్, బత్తిన గోపీ, ట్రస్టు సభ్యులు మెట్ల బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ

గుడ్లవల్లేరు : అడుసుమిల్లి సరోజని జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు శుక్రవారం వృద్ధులకు అన్నదానం చేసి దుప్పట్లు పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఎన్.శశికళ, కార్యదర్శి పెరుమాళ్ళు, వైపిసి ప్రసాద్, అడుసుమిల్లి వెంకట రమణారావు, బొర్రా నాగేశ్వరరావు, జంగం మోహనరావు, జాస్తి సుబ్రహ్మణ్యేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో రోడ్లు, గోకులం షెడ్లు

కోడూరు : ఉపాధి పనుల్లో 66 సీసీ రోడ్ల నిర్మాణం, 61 గోకులం షెడ్ల నిర్మాణానికి మండల సమావేశం తీర్మానించింది. ఎంపీపీ కొండవీటి వెంకట కుమారి అధ్యక్షతన శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. గ్రామసభల్లో ప్రతిపాదించి, ఆమోదించిన పనుల వివరాలను వెల్లడించారు. పనుల నిర్వహణకు రూ.5.20 కోట్ల నిధులు మంజూరైనట్లు తెలిపారు. ఈవో పీఆర్డీ నాగరేవతి, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీటీసీ సభ్యులు, గ్రామ సర్పంచ్‌లు పాల్గొన్నారు.

జనసైనికుల రక్తదానం

మచిలీపట్నం టౌన్ : ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ పుట్టిన రోజు సందర్భంగా వారం రోజుల పాటు వరుసగా నిర్వహిస్తున్న కార్యక్రమాలలో భాగంగా శుక్రవారం జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. నగర అధ్యక్షుడు గడ్డం రాజుతో పాటు పలువురు జనసేన కార్యకర్తలు రక్తదానం చేశారు.

యానాదులకు రాయితీపై బోట్లు

నాగాయలంక : మండలంలోని 50 యానాది కుటుంబాలకు రూ.30 లక్షలు విలువైన 10 బోట్లను నాబార్డు చీఫ్ జనరల్ మేనేజర్ ఎం.ఆర్.గోపాల్ అందజేశారు. ప్రజాప్రగతి సేవా సంఘం అధ్యక్షులు పరుచూరి వెంకటేశ్వరరావు, భాస్కర్, రాజశేఖర్, ప్రతిభ, యానాదుల సంఘం నేతలు పాల్గొన్నారు.



రామలింగేశ్వరస్వామి దేవాలయంలో వరలక్ష్మీ వ్రతాలు | పెడన పైడమ్మ ఆలయంలో వరలక్ష్మీ వ్రతాలు

వైభవంగా సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

మచిలీపట్నం టౌన్ : రామలింగేశ్వర స్వామి ఆలయ ఈవో సుబ్బారెడ్డి పర్యవేక్షణలో, బచ్చుపేట వేంకటేశ్వర స్వామి దేవాలయంలో ఆలయ చైర్మన్ ముత్తేవి రవికాంత్, అన్నంభొట్ల బ్రహ్మానందశాస్త్రి, కార్యనిర్వహణాధికారి ఎన్.ఎస్. చక్రధరరావు పర్యవేక్షణలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. స్థానాచార్యుడు ముత్తేవి శశికాంత్ ప్రత్యేక పూజలు జరిపారు. **మోపిదేవి :** బొబ్బర్లంక అంకమ్మ తల్లి ఆలయంలో అర్చకులు బాల జగన్నాథ నాగేశ్వరరావు పర్యవేక్షణలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు, కుంకుమార్చనలు వైభవంగా నిర్వహించారు. **అవనిగడ్డ రూరల్ :** పులిగడ్డ అలివేలు మంగ, రాజ్యలక్ష్మీ సమేత పద్మావతి అమ్మవారికి ఆలయ అర్చకులు అగ్నిహోత్రం ధన్వంతరాచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకనూరులో అంకమ్మ అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు మాదివాడ శ్రీనివాస పెరుమాళ్లు పర్యవేక్షించారు. **కూచిపూడి :** కూచిపూడి బాలాత్రిపుర సుందరిదేవి లక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. చినముత్తేవి, పెదపూడి, మొవ్వ, గూడపాడు, మొవ్వపాలెం, కోసూరు, కాజ, నిడుమోలు, అయ్యంకి గ్రామాల్లోని దేవాలయాల్లో అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణ, విశేష పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. **గుడివాడ రూరల్ :** చిన్న ఎరుక పాడు గ్రామంలోని అష్టలక్ష్మి ఆలయంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ట్రస్టీ సభ్యులు అమ్మవారికి ప్రత్యేక అలంకరణ గావించారు. **పెడన :** పైడమ్మ తల్లి ఆలయంలో మహిళలు అమ్మవారికి కుంకుమపూజ చేశారు. అన్నసమారాధన జరిగింది. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త దాసు వాయునందనరావు, ముత్యాలమ్మ ఆలయం (ఘటం గుడి) ధర్మకర్త తోట పైడేశ్వరరావు, తోట మహశ్రీకుమార్ తదితరులు పాల్గొన్నారు.